# ధర్మగ్లాని

సర్వధర్మాలనూ పరిత్యజించి తననే శరణుపొందిన వారిని తాను రక్షింపగలనని వాగ్దానం చేశాడు భగవంతుడు! మహానుభావుడు గడుసువాడే మరి! కాశీకి వెళ్లినవాడు తనకిష్టమైన కూరగాయ నొకదాన్ని వదిలిపెట్టి నట్టుగా మనకిబ్బందిగావున్న ధర్మాన్ని దేన్నయినా విసర్జించగలం గానీ. మూక ఉమ్మడిగా ధర్మాలన్నింటినీ త్యజించడం మనతరంగాదు. సర్వసంగ పరిత్యాగి మాత్రమే సర్వధర్మ పరిత్యాగికాగలడు. సంఘంలో తానొకడుగా మన వలసి వున్నంత వరకు మానవుడేవో కొన్ని కనీసపు ధర్మాలకైనా కట్టుబడి వుండడం తప్పనిసరి! వ్యాసమూర్తి పెద్దగా ధర్మనిష్ఠుడైతే గాకపోవచ్చు. కానీ ధర్మభ్రష్టుడు మాత్రం గాదు. తాను చేస్తున్న పనివల్ల లోకానికి మేలు కలుగకపోతే మానె. కీడైనా కలుగకుండా వుండాలన్నది అతడి ముఖ్యమైన ఆశయం. ఎంతగా తనకు వీలులేక పోయినా, ఆదొక అసిధారావ్రతంలా అతడీ కనీసపుధర్మాన్ని పాటిస్తూ వచ్చాడు. తన ఆశయాన్ని ఒక చాదస్తం క్రింద నిరూపించి తన వ్యక్తిత్వాని కొక క్రొత్త స్వరూపం ప్రసాదించ గలిగిన వ్యక్తి ఒకడు జీవిత పథంలో తటాలున తన కెదురుగా వచ్చునని అతడు కలలోనైనా అనుకోలేదు. ఆ ఎదురైన వ్యక్తి పేరు రాధాపతి.

ఎవడా రాధాపతి?

అయిదేళ్లకు మునుపు ఆ రాధాపతి ఎవడో ఈ వ్యాసమూర్తికే తెలియదు. ఏదో సభలో పాల్గొనడం కోసం ఒకసారి వ్యాసమూర్తి పట్టణం వెళ్ళాడు. సభలో అతడి ప్రారంభోపన్యాసమేమో సకాలంలోనే ముగిసింది. సభాంతంలో వినోద కార్యక్రమాలున్నాయి ఆ వ్యవధిని చేజిక్కించుకుని కొందరు ఉపన్యాసకులు మైకుకు మైకం వచ్చేటట్టుగా మాట్లాడేస్తున్నారు. ఆపద్ధర్మం క్రింద కొన్ని నియమాలను ఉల్లంఘించడం లోకంలో సహజమే. ఊపిరి త్రిప్పుకోవడానికి వీలుగా సభాసదుల్లో పెక్కుమంది సభాసంప్రదాయాన్ని అతిక్రమించినవారై తమతమ అసనాలను, అంగస్త్రాలను,

చేతి గుడ్డలను, పుస్తకాలను కాపుంచి వెలుపలికి వెళ్లిపోసాగారు. తన ఉపన్యాసం ఎలాగూ పూర్తయింది. గనుక యిక అక్కడుండి మాత్రం తాను చేయగలిగిందేమీ లేదన్న ఆత్మజ్ఞానాన్ని పొందినవాడై వ్యాసమూర్తి గూడా వేదిక వెనుకవైపునుంచి మెల్లగా ఈవలికి జారుకుని, భవన ప్రాంగణంలో వున్న వేపచెట్ల నీడల్లోకి వచ్చేశాడు. పైన గ్రుడ్డివెన్నెల. క్రింద చల్లటి నేల. ఆ చోటు నిర్జనంగాకూడా వుంది. ఏకాంతాన్ని సద్వినియోగం చేసుకోదలచుకున్న వ్యాసమూర్తి సిగరెట్టు ముట్టించుకున్నాడు. సిగరెట్టు సగంమేరకైనా కాలిందో లేదో పలకరింపు వినిపించింది.

"నమస్కారమండీ మేష్టరుగారూ!"

అది పరిచయమున్న కంఠం గాదు. ప్రశ్నార్థకమైన చూపులతో కొత్తవ్యక్తివైపు తిరిగాడు వ్యాసమూర్తి.

"మిమ్మల్ని చూడాలన్న కోరిక ఈనాటిది కాదు.ఎంతో కాలం నుంచీ వేచివున్నాను. ఈనాటికి కాలం కలిసి వచ్చింది. ఎన్నో పనులున్నా సభకు మీ రొస్తున్నారని తెలిసి యిలా వచ్చేశాను. చాలా ఆనందంగా ఉందండీ మేష్టారుగారూ!"

దర్శన మాత్రం చేతనే తాను కొందరికి ఆనంద సంధాయకుడుగా గావడమన్నది వ్యాసమూర్తికి సైతం యించుక ఆనందాన్నే కలిగించింది. ఆ ఆనందాన్ని ఎలా వ్యక్తం చేయాలో తోచక అతడొక సాదాప్రశ్నతోనే సంభాషణకు సిద్ధమయ్యాడు-

"ఏంచేస్తుంటారు మీరు?"

"కాలేజీలో చదువుకుంటున్నాను. ఇది చివరి సంవత్సరం, చదువు పూర్తికాగానే నాకేదైనా ఉద్యోగంలో చేరాలనివుంది. మా నాన్నగారికి ఉద్యోగాలంటే సరిపడవు. ఆయన ఏదైనా బిజినెస్సులోకి దిగమంటున్నారు. ఈ లోగా కథలు వ్రాయడం నాకొక హాబీ అయికూర్చుంది. బహుశా మీరు చూచేవుంటారు- 'టి.పి.రాధ' అన్న పేరుతో నాకథలు కొన్ని ప్రచురింపబడ్డాయి...."

ఎదుటివ్యక్తి నొకసారి బాగా పరకాయించి చూచాడు వ్యాసమూర్తి. తనకళ్ళే తనను మోసగించే సూచనలేవీ ద్యోతకం కావట లేదు, లోక వ్యవహారాలు సజావుగా సాగిపోవడానికి ఈనాడు ఎన్ని ప్రతిబంధకాలైనా వున్నాయి. మగవాళ్ళు ఆడపేర్లతోనూ, ఆడవాళ్ళు మగ పేర్లతోనూ వ్యవహరింపబడడం ప్రారంభమైతే, అది అదనంగా మరొక యిబ్బంది మాత్రమే అవుతుంది. ఐనా పురుషుడన్న తరువాత రాధకు పతి గావడమే సబబుగానీ అసలు రాధే అయిపోవడం ఎంత అసంగతం!

ఐనా ఈ అవసరమైన మీమాంస తన కెందుకనుకున్నాడు వ్యాసమూర్తి.

"ఈ మధ్య నేనంతగా పత్రికలజోలికి వెళ్ళడం లేదు. ఇక మీదట ఎప్పుడైనా

'టి.పి.రాధ' అన్న పేరుతో కథలు కనిపిస్తే తప్పకుండా చదువుతాను. రాధాపతి అన్న పూర్తి పేరుతో వ్రాసినా సరే. మీ కథలు చదవడానికి నా కభ్యంతరముండదు" అన్నాడు వ్యాసమూర్తి.

"భలే మాటన్నారండీ మేష్టారుగారూ! పూర్తిపేరుతో నేను కథలు వ్రాయలేదనుకున్నా రేమిటి! వ్రాసి చూచాను. ఫలితం చాలా నిరాశాజనకంగా కనిపించింది. పంపినవి పంపినట్టే తిరిగి వచ్చేశాయి. ఇంతలో ఎవడో ఒక శ్రేయోభిలాషి ఈ గోసాయి చిట్కా ఉపదేశించాడు పేరు కత్తిరించేశాను. చిట్కా అమోఘంగా పనిచేసింది...."

"అబ్బే నేను సంజాయిషీ అడిగానటయ్యా రాధాపతీ! లోకంలో మనకెన్నో విడ్డూరాలు ఎదురవుతుంటాయి. అన్నింటికీ కారణాలు తెలుసుకోదలిస్తే, సంజాయిషీలు వినడానికే జీవితంలో సగంవంతు సరిపోతుంది. అడుసు ద్రొక్కనేల కాలు గడగనేల! ఏలాగో ఒకలాగు కథలు ప్రకటింపబడడమే మనకు కావలసింది..."

"పోనివ్వండీ మేష్టరుగారూ! నీవు ఒకందుకుపోస్తే నేను ఒకందుకు త్రాగుతున్నానన్న సామెతలా వుంది మన ప్రసంగం! పనిగట్టుకుని నేనిలా మిమ్మల్ని కలుసుకోడానికి రావడం. కథలు వ్రాస్తున్నానని చెప్పుకోడానికి కాదు..."

"ప్రసక్తి వచ్చింది గనుక చెప్పావు తప్పేముంది రాధాపతీ!"

"తప్పో, ఒప్పో నాకు తెలియదు. నేను మీకు చెప్పుకోవలసిన విషయాలైతే చాలా వున్నాయి. ఇక్కడ యిప్పటిప్పుడే ఈ ఉపన్యాసాలు ముగిసేటట్టు లేవు. మనం ఈ దొడ్డిదారిగుండా వెలుపలికి వెళ్ళవచ్చు ఈ వేళప్పుడు గోల్డెన్‌కేఫ్‌లో కాఫీ బలే రుచిగా వుంటుంది. ప్రక్కనేవున్న పార్కులో కూర్చుంటే కాసేపు నింపాదిగా మాట్లాడుకోవచ్చు..."

హోటల్లో కాఫీ రుచిగా వుండడంలోనూ, పార్కులో వాతావరణం ఆహ్లాదకరంగా వుండడంలోనూ ఆశ్చర్యంలేదు. అనుకున్నది అనుకున్నట్టు గానే వున్నప్పుడు మనిషికి ఆశ్చర్యం కలుగదు. రాధాపతి ప్రసంగంలో ఎలాంటి మలుపునైతే వ్యాసమూర్తి వూహించలేదో ఆ మలుపు తటాలున ప్రారంభమైపోయింది.

"1958 లో ననుకుంటానండీ మేష్టరుగారూ! అప్పుడప్పుడే నేను సాహిత్య ప్రపంచంలోకి జొరబడుతున్నాను. మద్రాసుకు వెళ్తూ వెళ్తూ రేణిగుంట స్టేషనులో ఓ వారపత్రిక కొనుక్కున్నాను. 'వాగు, వంతెన' అన్నకథ అందులో కనిపించింది. అదే మీ కథల్లో నేను చదివిన మొదటికథ. అదెందుకు నాకింకా జ్ఞాపక ముందంటరా? అదే చెబుతున్నాను. అందులో ఒక లక్ష్మీపుత్రుడు అడివిబాటలో కారుచెడి పోవడం వల్ల తిండిలేక అలమటించ వలసి వస్తుంది. ఆ కథ చదివిన పదోనాటికల్లా సరిగ్గా అలాంటి

అనుభవమే ఎదురైందినాకు! అన్నట్టు కథలోని ఆ పాత్ర పేరు కూడా నా పేరే కావడం విచిత్రం! ఆ మాటకొస్తేనండీ మేష్టరుగారూ! అదెందుకో గానీ- ఇకా రాంతపు పేర్లంటే మీకు చాలా యిష్టం. రాధాపతి, చలపతి, శ్రీహరి, సాత్యకి, శత్రుకీర్తిలాంటి పేర్లే మీ కథల్లో కనిపిస్తాయి. ఒకసారేం జరిగిందంటే మీరొక పత్రిక కొక పెద్ద కథ వ్రాశారు. అది మాసపత్రిక. తీరా చదువుకుంటూ వచ్చేసరికి ఆఖరున సశేషమన్న పదం కనిపించింది. అంతలో మాకు ఎన్.సి.సి. క్యాంపులు వచ్చిపడ్డాయి. పదిహేను రోజులపాటు ఏ నిర్జన ప్రదేశంలో గడిపి తిరిగి వచ్చేసరికి, ఆ మాసపత్రిక తాలూకు మరు సంచిక రానూవచ్చింది. అయిపోనూ అయిపోయింది. పట్టణంలో నాలుగు లైబ్రరీలు ఉన్నాయి. ఓ లైబ్రరీకి పరుగుదీశాను. అక్కడ పత్రికైతే ప్రత్యక్షమైందిగానీ అందులో మీకథ వచ్చిన పేజీలు మాత్రం లేవు. ఎవరో కట్‌చేసి తీసుకు వెళ్ళిపోయారు. మిగిలిన మూడు లైబ్రరీల్లో గూడా ప్రయత్నించి చూచాను. ఎక్కడికి వెళ్ళిచూచినా అదే పరిస్థితి! దీనిపైన నా వ్యాఖ్యానం అవసరమంటరా మేష్టరుగారూ! పాఠకులకు మీ పైన వున్న అభిమానానికి యింతకన్నా ఏం నిదర్శనం గావాలి?"

విహరించడానికి తియ్యని నీరు దొరికితే చేప కంతకంటే కావలసిందే ముంటుంది? రాధాపతి కురిపించిన ప్రశంసా వర్షమే తియ్యటి నీరు. వ్యాసమూర్తి అంతరంగమే చెరువుచేప. సంకీర్తన మంటే సర్వేశ్వరుడికైనా యిష్టమే! వ్యాసమూర్తి ఎంతటివాడు! అతడా ప్రశంసాఝురిలో పడి ఎంతో దూరం కొట్టుకునిపోయి వుండవలసింది కానీ ఎందుకోగానీ తిరగబడి ఒడ్డుకు చేరుకోవాలనిపించిందతనికి! ప్రశంసలను భరించడ మేమంత సులభమైన పనిగాదు. అలా భరించ గలిగినవాడు అయితే సర్వజ్ఞుడైనా కావాలి, లేదా అజ్ఞాని అయినా కావాలి. పై రెండింటిలో ఏ ఒకటీగాదు వ్యాసమూర్తి!

నా పైన పాఠకులకు అభిమానమున్న మాట నిజమేననుకో రాధాపతీ! అందుకు కారణ మేమిటని అడిగితే, నేను వినమ్రుడనై అందుకు కారణం నా అదృష్టమనే చెప్పుకుంటాను. ఎందుకంటే నేను కేవలం పాఠకులకు రుచించాలన్న ఉద్దేశంతో నా రచనయొక్క స్వరూపాన్ని ఎన్నడూ నిర్ధారించుకోలేదు. నాకూ, నా పాఠకులకూ అభిప్రాయభేదాలు దండిగా వున్నాయి. మొదట స్థూలమైన వాటిని మాత్రం పేర్కొంటాను. నేను నా రచనల నన్నిటినీ మరీ సంగ్రహంగా ముగించి వేస్తున్నానన్నది కొందరి రిమార్కు నా 'కాన్వాసు' చాలా పెద్దదట! అది నవలకైతే చాలా బాగుంటుందట! అట్లాగని మరి కొందరు చెబుతారు. ఒకసారి నేను రెండు వందల పేజీలతో ఒక నవల వ్రాశాను. చదివిన ఒక పాఠకుడన్నాడు కదా. అందులోని కథను రెండు విభాగాలుచేసి వందపేజీల

పరిమితిలో రెండు నవలికలుగా వ్రాసివుంటే బాగుండేదట! పెళ్ళాడదానికి యిరువదేళ్ళ అమ్మాయిగాకపోతే పదేళ్ళవాళ్ళు యిద్దరైతే ఏమనడం ఎంత బాగుంటుంది? పాఠకుల అభిప్రాయాలు ఒక్కొక్కప్పుడు యింత చిత్రంగా వుంటుంటాయి..."

"ఎవరి అభిప్రాయాలు వారి కుండడంలో తప్పేముందండీ మేష్టరుగారూ....!"

"అబ్బే, తప్పనిగాదు! నేను పాఠకుల అభిప్రాయాలకు అనుగుణ్యంగా నా రచనలను దిద్దీ తీర్చుకోలేదని మాత్రమే చెబుతున్నాను. మొదట నేను ఏదో ఒక విధంగా ఒక నవల వ్రాసి పూర్తిచేస్తే చాలు ననుకునేవాణ్ణి! నా రచనల్లో చదివించే శక్తి ప్రకటితమైనకొద్దీ నా అభిమాన పాఠకులసంఖ్య పెరుగుతూ వచ్చింది. 'ప్రారంభం బాగుంది. ముగింపు బ్రహ్మాండంగా వుంది. ఫలానా పాత్ర పోషణ అద్భుతం. ఫలానాచోట '....' అన్న మాటలు రచనకంతా జీవంపోశాయి. అంటూ నాకు తరచుగా టపాద్వారా ప్రశంసలందుతుండేవి. ఆ దశలో నేను నా పాఠకుల కొక కాలక్షేప సాధనంగా ఉపకరించినమాట నిజం! కానీ తరువాత తరువాత కథ నా కొక అలంబనంగా మాత్రమే పరిణమించింది. ఆ ఆలంబనం ద్వారా నేను చెప్పదలచుకున్న విషయానికి ప్రాధాన్యం హెచ్చింది. ఈ దశలోనే నాకూ పాఠకులకు బెడిసిపోవడం గూడా ప్రారంభమైంది. 'ఫలానా కథలో అబ్బాయికీ, అమ్మాయికీ పెళ్ళి కాకుండానే ముగించారు. పెళ్ళయిందని చెప్పివుంటే (లేదా పెళ్లిచేసివుంటే) మీసొమ్మేంపోయింది?' అంటూ పాఠకులు నా కెదురు తిరగసాగారు. అదెలాసాధ్యం? ఆవిడేమో గొప్పింటి అమ్మాయి. కారుల్లోనేగానీ నేలపైన తిరుగదు. ఈ కుర్రాడేమో వారాలబ్బాయి. ఆ యిద్దరికీ పెళ్ళి కావడమనేది నాటకాలలోనైతే సంభవం! వెండితెర పైన అయితే సంభవం! లోకంలో అదెలాకుదురుతుంది? ప్రేమ గ్రుడ్డిది కదా అని సమాధానం. ప్రేమంటే ఏమిటని నా ప్రశ్న. నువ్వు 'ప్రేమ' అని దేన్ని అయితే అనుకుంటున్నావో- అది నీకు పదిమంది పైన కలగడంలేదా? ఆ పదిమందినీ నువ్వు పెళ్ళాడ గలవా? అసలీ ప్రేమిస్తున్నా మనుకుంటున్న వారిలో నూటికి తొంభై తొమ్మిదిమంది విషయంలో ఈ ప్రేమ అనేది ఒక చిత్తభ్రమ లాంటిదేమోనని నా సందేహం, రచనద్వారా నేను పరిష్కారాలుగానీ ప్రతిపాదనలుగానీ చేస్తున్నానని చెప్పను. రచనద్వారా నేను ఆలోచించడం ప్రారంభించాను. ఈ ఆలోచన పాఠకులలో కొందరికి సరిపడకపోతే నేనేం చేయగలను! ఆ యీ కారణాలవల్ల నా అభిమాన పాఠకుల సంఖ్య తగ్గిపోతున్నదని గూడా కొందరు శ్రేయోభిలాషులు సెలవిచ్చారు. నిజమే గావచ్చు. నివారింపలేని దేదైతేవుందో, అది సహింపబడవలసిందే గదా!"

గంట పది కావచ్చింది.

"ఈపాటికి నాటకాలు జరుగుతుంటాయి. ఈవేళ అప్పుడు అక్కడికి వెళ్ళడమెందుకండీ మేష్టరుగారూ! నేరుగా మాయింటికే వెళ్దాం. భోజనం చేసి హాయిగా రెస్టు తీసుకోవచ్చు..." అన్నాడు రాధాపతి.

"భక్తుడెందు జన్న పరతెంతు నేనును, గోవు వెంట దగులు కోడెభంగి..." అన్నాడు భగవానుడు! భగవంతుడికే అలాంటి ప్రలోభాలుండగా యిక వ్యాసమూర్తి దేముంది? అతడు రాధాపతి కోరికను మన్నించకుండా వుండలేకపోయాడు.

ఇంటికి వెళ్దామని రాధాపతి సూచన చేసినప్పుడు అది బహుశా ఒకమారు మూల వీధిలోని సుమారు పాటి యిల్లై వుంటుందనే అనుకున్నాడు వ్యాసమూర్తి. అతడి వూహకు, వాస్తవానికి సంభంధమేలేదు. అందమైన కట్టడాల క్రొత్త కాలనీలో ఓ మూడంతస్తుల మేడ ఎదుట రిక్షా ఆగింది 'ఇదేనండీ మా యిల్లు' అన్నాడు రాధాపతి. మహారాణిని 'మగువ యొకర్తుక' అన్నట్టుగా దీన్ని యిల్లనడ మేమిటి? దీన్నే యిల్లనుకుంటే యిక భాష లోని భవనం, ప్రాసాదం, మహడీలాంటి పదాలగతేం కావాలి?

ఆ భవనంలో వ్యాసమూర్తిని కతిపయద్వారాలు దాటించి సుఖాసనాల షో రూములాంటి ఒక పెద్దగదిలో కొంతసేపు సేదతీరనిచ్చి, చన్నీళ్ళ కనీ, వేన్నీళ్ళకనీ వేర్వేరుగా పైపులున్న బాత్‌రూములో స్నానమాడింపజేసి, షడ్రసోపేతంగా మృష్టాన్నం పెట్టించిన తరువాత మత్తుగా అతడు భుక్తాయాసాన్ని అనుభవిస్తున్నవేళ -- బీరువాలోనుంచీ పాతకాలంనాటి చేట భారతాలంత పుస్తకాలు రెండింటిని పైకితీశాడు రాధాపతి.

"ఏం పుస్తకాలవి?" అన్నాడు వ్యాసమూర్తి.

"మీరచనలేనండీ మేష్టరుగారూ! పత్రికల్లో రాగానే కత్తిరించి" యిలా బైండు చేయించాను..."

ఇది నిజంగా అబ్బురం కలిగించే సంగతి! తన రచనల భౌతిక జీవితాన్ని గురించి వ్యాసమూర్తి కుండిన అభిప్రాయం దీనితో తల్ల క్రిందులై పోయింది. వ్రాసిముగించి రచనను పోస్టు చేయడం వరకు మాత్రమే తన వంతనుకునే వాడు వ్యాసమూర్తి. ఆ తరువాత దాని జాతకాన్ని నిర్ణయించేవాడు తానుగాడు. తపాలాశాఖవారు దాన్ని పరామర్శిస్తారు. సంపాదకులు పరిశీలిస్తారు. ప్రూఫ్‌రీడర్లు అక్షరక్షరంగా శోధిస్తారు. తరువాత న్యూస్ ఏజంట్లు స్పర్శిస్తారు....చిట్టచివర మహాభారతాన్ని గానివ్వు. మందులకేట లాగును గానివ్వు సమదృష్టితో చూడగలిగిన చిల్లర కొట్టువర్తకులుదాన్ని చించి పొట్లాలుకడతారు. ఆపైన దాని పరిణామాన్ని గురించి వూహించడానికి వెనుకావాడేవాడు వ్యాసమూర్తి. అలాంటి రచనల కింతటి పూజ్యస్థానమా? ఇల విశాల, కాలం అనంతం

గనుక తన రచన ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట గౌరవింపబడగల దనుకున్న భవభూతికన్నా తానెంతో అదృష్టవంతుడు! తన రచన లెప్పుడో గాదు, యిప్పుడే-ఎక్కడో గాదు - ఇక్కడే గౌరవింపబడు తున్నాయి!

ఆ రోజు రాత్రి వ్యాసమూర్తికి తీయటి కలలు రావడంలో ఆశ్చర్యమేమీలేదు. కానీ మరునాటి ఉదయం ఆరుగంటలకు దిగ్గున మేలుకునే సరికి అతనికి జ్ఞప్తికి వచ్చిన విషయాలంత తీయటివేమీ కాదు. నిన్నటి రోజుతాను బయల్దేరుతుండగా బియ్యం నిండుకున్నాయంటూ అర్ధాంగి చెప్పినమాట. నాలుగు రోజుల గడువులో ఓ వంద రూపాయలైనా చెల్లించకపోతే అకౌంటు పొడిగించనని సామానుల కొట్టువాడు చేసిన హెచ్చరిక. రానున్న దీపావళికి యింటిల్లిపాదికి క్రొత్త బట్టలు కొనవలసివున్న అవసరం-యివన్నీ ఒక పెట్టున తలపులో మెదిలి వ్యాసమూర్తి మనసును చీకాకు పరిచేశాయి.

స్టేషనుదాకా వచ్చి వ్యాసమూర్తిని రైలెక్కించాడు రాధాపతి. "మీ యీ అభిమాన పాఠకుణ్ణి మరిచిపోకండి మేష్టరుగారూ!" అన్నాడు.

మరచిపోవడం ఎలా సంభవం?

ఆ తరువాత అప్పుడప్పుడూ ఉత్తరాలు వ్రాస్తుండేవాడు రాధాపతి. టి.పి.రాధ అన్న పేరుతో ఎక్కడైనా రచనలు కనిపిస్తే వ్యాసమూర్తి గూడా చదవడానికి బద్ధకించేవాడు కాదు. కానీ ఆవిధంగా అతడికి కనిపించిన రచనల సంఖ్య కొద్దిపాటిది. ఆ రచనల్లో వస్తువు లేకపోలేదు. శిల్పం లేకపోలేదు. శైలిగూడా మంచిది. కాని వీటికన్నా ముఖ్యమైనదేదో ఒకటి వాటిల్లో లేనట్లుగా తోచేది వ్యాసమూర్తికి! ఒక పెద్ద హోటలుంది. అక్కడి స్టోరు రూములో లేని వస్తువులు లేవు. అన్నీ వున్నప్పటికీ అక్కడ కూడా ఒక్కొక్కప్పుడు కొన్ని శాకపాకాలు రుచించకపోవడం కద్దు! ఎందుకని ప్రశ్నిస్తే కారణం చెప్పడం కష్టం. ఈ మానవుడున్నాడే వీడు స్వప్రయోజకత్వాన్ని గురించి బడాయి మాటలైతే చెప్పుకోగలడు గానీ బాహ్యపరిస్థితులు నుంచీ ప్రేరణ లేనిదే గరికపోచనైనా కదల్చలేడు. సాహిత్య సృష్టికి ప్రేరణ చాలా అవసరం. ఘర్షణ లేనిదే ప్రేరణ ఎక్కడిది? రాధాపతి జీవితంలో ఘర్షణకు తావేలేదేమో! మరైతే అతడు రచయితగా స్థిరపడడం ఎలా సంభవం? దేని కొరకో పుట్టినవాడు. దాన్ని చేరుకోడానికి ముందుగా మార్గమధ్యంలో కొన్ని తప్పటడుగులు వేయడంకద్దు! రచన చేయడమన్నది రాధాపతి వేసిన తప్పటడుగేమో! అతడు కృషి చేయవలసినది, రాణించవలసినది ఈ రంగంలో కాదేమో!

లోకంలో ఒక్కొక్కప్పుడు కలలోనైనా అనుకోని సంఘటనలు జరుగుతుంటాయి. ఇక వూహించినవి జరగడంలో విడ్డూర మేముంది? రాధాపతి విషయంలో వ్యాసమూర్తి

వూహ నిజంగావడానికి కొంతకాలమైతే పట్టింది. రెండు మూడేళ్ళు అదేపనిగా రచనా వ్యాసంగంతో కుస్తీలుపట్టి, విసుగెత్తిపోయి ఆ ప్రయత్నం నుంచి విరమించే నిర్ణయానికి వచ్చాడు రాధాపతి. అందుకు వ్యాసమూర్తి విచారించలేదని ప్రత్యేకంగా చెప్పడం అనవసరం. చూపులకేగాని, మేపులకు పనికిరానిది రచనావృత్తి. అది దాన్ని చేబట్టిన వారిలో చాలా మందికి ఉదరపోషణకైనా మెరుపు చూపించడం లేదు. బాగా చేయి తిరిగిన రచయితలలోనే కొందరు సినిమాలలోకి చొరబడి అక్కడ నాలుగు రాళ్ళు కళ్ళజూచేసరికి ఈ కథలమాట, ఈ నవలలమాట కట్టి పెడుతుండగా పుట్టకతో శ్రీమంతుడైన రాధాపతి కిందులోనే స్థిరపడవలసిన ప్రారబ్ధ మేముంది? అతడు తలచుకుంటే ఏ వ్యాపార రంగంలోనైనా ప్రవేశించి అశ్రమంగా ఏడాదికో పదివేల రూపాయలు వెనకవేయగలడు!

అందాకా బాగానే వుంది. కానీ ఈ రంగం నుంచీ నిష్క్రమించి రాధాపతి చేయదలచుకున్న పనేమిటో తెలిసేసరికి వ్యాసమూర్తికి మతి పోయినంత పనైంది.

"ప్రియమైన మేష్టరుగారూ! నమస్కారాలు!" అంటూ ప్రారంభించాడు రాధాపతి– "రచయితను కాలేకపోయినందుకు నాకు విచారం లేదు. ఈ చివరినుంచీగాక పోతే నేమి, ఆ చివరి నుంచైనా నే నీ రచన యొక్క అంతేమిటో తేల్చుకోకపోను. నాన్నగారు నా పెట్టుబడి కోసం అయిదువేల రూపాయలిస్తామంటున్నారు. ఆ డబ్బుతో నేను కొన్ని పుస్తకాలు ముద్రిస్తాను. వాటితో మార్కెట్టులో అడుగు పెడతాను. నా యీ సదుద్యమాన్ని మీరు హర్షించగలరన్నదే నా నమ్మకం. మొట్టమొదట శ్రీకారంగా మీ పుస్తకాన్ని చేయాలన్నదే నా ఆశ. మీ అంగీకారం కోసం వేచివున్నాను, వెంటనే బదులు...."

చెప్పేవాళ్ళులేక చెడిపోయినవారు చాలామంది. రాధాపతి పేరు ఆ జాబితాలోకి ఎక్కడ ఎక్కిపోతుందోనని కంగారుపడి పోయాడు వ్యాసమూర్తి. ప్రత్యుత్తరం వ్రాసి మరుటపాలో పోస్టు చేశాడు.

"ప్రియమైన రాధాపతీ! గాజుల బేరం భోజనానికి మాత్రమే సరిపోతుందనీ, బాపన సేద్యం బత్యానికైనా చాలదనీ రెండు సామెతలున్నాయి. నువ్వు చేబట్ట దలచిన పుస్తకాల వ్యాపారం పై రెండింటిలో దేనికి వారసత్వం పుచ్చుకుంటుందో నాకు తెలియదు. మీ నాన్నగారు నీకు డబ్బిస్తారు. మంచిది. ఆయన నీ చేతి కిచ్చినప్పుడు మాత్రమే నువ్వు డబ్బును కళ్ళజూడగలవు ఆ తరువాత అది నీ కంటికి కనిపించదు. దిగినతర్వాతగానీ లోతు తెలియదంటారు పెద్దలు! లోతుమాట దేవుడెరుగు. నీకు ఈతయినా తెలీదేమోనని నా సందేహం! ఇది అనుభవం లేకుండా చెబుతున్న మాటగాదు. ఒకసారి నేను కాస్తా

స్వప్రయోజకత్వం వెలగబెట్టదలచి ఓ పుస్తకం అచ్చువేయించాను. అందులో నా కెదురైన అనుభవం పగవాడికైనా వద్దనుకున్నాను. మొదట ఏకులా కనిపించి రానురానూ మేకులా పీక నొక్కేవాళ్ళలో మొట్టమొదట ప్రెస్సువాళ్ళనే పేర్కొనాలి. వారు మొదటిసారి నేను భేటీ చేసినప్పుడు ఫారానికి పాతిక రూపాయలైతే చాలునన్నారు. పైగా కాగితాల ఖర్చుమాత్రం పెట్టుకోవలసి వుంటుందన్నారు. ముఖపత్రానికి బ్లాకు చేయించమన్నారు. ఆ బ్లాకుకు వందురూపాయలవుతుందన్నారు. కవరుపేజీకి డబ్బు తెమ్మన్నారు. అది సమర్పించుకున్నాక వెళ్ళి చూద్దునుగదా, ముఖపత్రమన్న పేరుతో దళసరి కాగితానికి దట్టంగా రంగులుపూసి పెట్టారు. ఇదేమిటని అడిగితే రంగుల ప్రింటుంగుకు మాత్రం వేరొక ప్రెస్సు చూసుకోవలసిందని సలహా యిచ్చారు. ఇంతా అయ్యాక బైండింగ్ ఖర్చు ప్రత్యేకం అన్నారు. నిండా మునిగినతర్వాత చలి అనలేముగదా! మన పుస్తకాలు మనకు దక్కితే చాలు ననుకున్నాను. అదిగూడా అడియాసే అయ్యింది. వెయ్యికి తొమ్మిది వందల ప్రతులు మాత్రమే చేతికొచ్చాయి. మిగిలినవి నిదానంగా బైండుచేసి పంపుతామన్నారు. ఇక పుస్తకం వెలువడిందన్న ఆనందాన్ని పదిమందితోనూ పంచుకోవాలి గదా! ఆ విధంగా పంచిపెట్టబడినవి పోగా, నికరంగా ఎనిమిదివందల ప్రతులుమాత్రమే మిగిలాయి. అప్పు పెట్టిన వాళ్ళెంత కాలమని వూరుకుంటారు? వాళ్ళ ఒత్తిడి భరించలేక ఓ అయిదు వందల పుస్తకాలు తీసుకుని దేశంపైన పడ్డాను. అమ్మకమైన తరువాత డబ్బు ముట్టజెప్పే షరతుమీద ప్రతి పుస్తకాల షాపులోనూ కొన్ని పుస్తకాలు పడవేయించాను. అమ్మి పెట్టినందుకు వాళ్ళెంతో కొంత కమీషన్ స్వీకరించడం న్యాయమే! కాదనలేము. కానీ కొందరు పుణ్యాత్ములు నూటికి నూరుపాళ్ళూ కమీషన్ క్రింద అపహరించేశారు. ఆలోగా నాపాట్లేవో నేను పడి చేసిన అప్పులు చెల్లించుకున్నాను. నా అవస్థలో నేనుండగా యింటి దగ్గర అటక పైన మిగిలివుండిన ప్రతులు ఏనాడో వరుణదేవుడి అనుగ్రహానికి గురై, ఆ తేమతో, ఆ మృదుత్వంతో చెదపురుగులకు విందుభోజనంగా ఉపకరించాయి. ఐనా అదొక అనుభవం కదా! అనుభవాలు వృధాపోవంటారు. సకాలంలో నిన్ను హెచ్చరించడానికి ఉపకరించింది. గనుక దాన్నొక అమూల్యమైన అనుభవంగానే పరిగణిస్తున్నాను. వద్దు బాబూ వద్దు! డబ్బుతో చేయదగిన వ్యాపారాలు బోలెడున్నాయి. వాటిల్లో దేనినైనా చేబట్టు. పుస్తకాల జోలికిమాత్రం వెళ్లొద్దు. నాయీ సలహా నీకు సకాలంలో అందుతుందనే ఆశిస్తున్నాను. వీలు వెంబడి బదులు. ఇట్లు నీ శ్రేయోభిలాషి– వ్యాసమూర్తి.

ఉత్తరం పోస్టుచేసిన వ్యాసమూర్తికి ఎంతో హుందగా తన కర్తవ్యాన్ని తాను నెరవేర్చుకున్నానన్న సంతృప్తి దక్కింది! రాధాపతి ముమ్మందుగా అచ్చువేయదలచుకున్నది.

తన పుస్తకమే! ఐనా ఆ ప్రలోభాన్ని సైతం తాను అరికాలితో రాచివేయగలిగాడు! తన ఉత్తరాన్ని చూడగానే రాధాపతి పుస్తకాల ముద్రణలోకి వురకాలన్న తన ఉబలాటాన్ని సమూలంగా తుడిచిపెట్టి వుంటాడు.....

రోదసిలోకి వెళ్ళిన తర్వాత భూమితో సంబంధాలు గోల్పోయిన రాకెట్టులా వ్యాసమూర్తి ఉత్తరానికి దాదాపు నాలుగైదు మాసాల వరకు బదులులేదు. ఒకనాటి శుభోదయాన టపాలో అతడి పేరిట ఒక పుస్తకాల బంగీవచ్చింది. అందులో సరిక్రొత్తవి- మూడు పుస్తకాలున్నాయి.

పెండోరా పెట్టె తెరచినప్పటినుంచీ యిక్కట్లే ప్రారంభమైనట్టుగా, పుస్తకాల బంగీ విప్పినప్పటి నుంచీ వ్యాసమూర్తికి ఆశ్చర్యమే ఎదురుకాసాగింది. ఆ పేర్లే కాస్త విలక్షణంగా వున్నాయి. మొదటి పుస్తకం పేరు ఏడవని ఎలనాగ. రెండవది ప్రణయవ్రణం. మూడో పుస్తకం వైతరణిలో పూల తెప్ప. ఏడవని ఎలనాగ ఏమిటి? ఎలనాగ అన్న తర్వాత ఏడవకుండా వుండదనేనా తాత్పర్యం? ఏ మంద మారుతంతోనో, ఏ వీణాగానంతోనో ఉపమించకుండా ప్రణయాన్ని వ్రణమనడమేమిటి? ఈ సరిక్రొత్త వ్రణానికి ఏ పెన్సిలిన్ అయింటుమెంటు పనికొస్తుంది? పై రెండింటికన్నా రెండాకు లెక్కువగా మేసింది మూడో పుస్తకం, నరక లోకం పొలిమేరల్లో ప్రవహించేనది వైతరణి. అది భయంకర జలచరాలు నివసించే మురికినీటి ప్రవాహం. మరెక్కడా చోటులేనట్టు పూలతెప్ప అక్కడ విహరించడ మేమిటి?

సాహిత్యంలో క్రొత్తదనం ప్రవేశించడానికి వ్యాసమూర్తి విముఖుడేమీగాదు. ఒకరి విముఖత్వంగానీ, సుముఖత్వంగానీ పరిణామాన్ని అడ్డజాలదని అతనికి బాగా తెలుసు. కానీ పరిశీలించిన కొద్దీ ఆ పుస్తకాలలోని క్రొత్తదనం వ్యాసమూర్తికి విస్మయాపాది మాత్రం కాగలిగింది. శిల్పంలో క్రొత్తపోకడ లేవీ లేవు. ప్రతినవలా ముగింపు దగ్గరికి వచ్చేసరికి పేలవంగా తేలిపోతుంది. అడ్రసులేని జాబులలాగా అందులోని పాత్రలకు తల్లి తండ్రులు, కుటుంబాలు లాంటి బ్యాక్ గ్రౌండు వున్నట్టు తోచదు. అబ్బాయిలు, అమ్మాయిలు, ప్రేమించుకోటాలు, సినిమాలు, డిన్నర్లు యివిమాత్రం ప్రతి నవలలోను పుష్కలంగా కనిపిస్తాయి. సమాజంలో మానవుణ్ణి వేధిస్తున్న సమస్య లెన్నో వుండగా ఎవడో ఒకఅబ్బాయి, ఎవతెనో ఒక అమ్మాయిని ప్రేమించడము లేదా ప్రేమించక పోవడమే జగత్తుకొక జీవన్మరణ సమస్యగా పరిణగించడానికి వీళ్ళకు మనసెలా ఒప్పింది? అబ్బే, ఈ పుస్తకాలు అమ్ముడు కావు. రాధాపతి గోతిలోపడడం ఖాయం. తాను నెత్తిన నోరు పెట్టి మొత్తుకున్నా అతడు గోతిలో పడడానికే సిద్ధపడ్డాడు!

చేసిన తప్పు తెలిసి రావడానికి కొంతకాలం పడుతుంది. పశ్చాత్తాపపడడం రెండవ దశ. మూడవదశలో క్షమాప.. కోరడంకోసం రాధాపతి తన దగ్గరికి రాక తప్పదని భావించాడు వ్యాసమూర్తి. అతడి వూహ నిజమైంది! వ్యాసమూర్తిగారి యిల్లెక్కడ అంటూ ఓ యువకుడు బస్‌స్టాండులో దిగాడన్న వార్త తెలియగానే, ఆ వచ్చినవాడు రాధాపతే అయివుంటాడని వ్యాసమూర్తి అనుకున్నాడు. కానీ ఒక విషయంలో అతడి వూహ ఘోరమైన పరాజయానికి గురైంది. రాధాపతి విచార భారంతో కృంగిపోయిలేడు. మీదుమిక్కిలి ఆకాశానికి మూడే బారలన్నంత ఉత్సాహంగా వున్నాడు.

"నమస్కారమండీ మేష్టరుగారూ! మీరు వద్దన్నా ఈ రంగంలో దిగినందుకు మీరు నన్ను మన్నించాలి. పరిస్థితులు చాలా ఆశాజనకంగా వున్నాయి. మొన్నవేసిన పుస్తకాలు అప్పటికప్పుడే ముప్పాతిక భాగం అమ్ముడుపోయాయి. వేడి చల్లారిపోక మునుపే మళ్ళీ కొన్ని పుస్తకాలు వేయాలనుకుంటున్నాను. ఈ దఫా ఒక్కసారిగా ఓ అరడజన్ పుస్తకాలే బయటికి తేవాలని సంకల్పం...."

"అవి....ఆ పుస్తకాలు....ఎలా అమ్ముడు పోయాయి రాధాపతి? ఎవరు కొన్నారు?" నివ్వెరపోతూ అడిగాడు వ్యాసమూర్తి.

వ్యాసమూర్తి నోటవెలువడిన ప్రశ్న రాధాపతికి సైతం ఆశ్చర్యాన్నే కలిగించింది. "అదేమిటండీ మేష్టరుగారూ! పుస్తకాలు బాగాలేవనా మీ ఉద్దేశం? రొమ్ములు తిరిగిన పబ్లిషర్లు గూడా గెటప్ చాలా బాగుందని మెచ్చుకున్నారు. ముఖచిత్రాల విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాను. చిత్రకారుడికి రెండు వందల దాకా ముట్టజెప్పాను..."

"అబ్బే, అదికాదు రాధాపతి! నేను చెప్పడం లోపలి విషయం సంగతి...."

"లోపలి విషయం సంగతి ఎవరు చూడొచ్చాడు? డబ్బిచ్చి పుస్తకం కొంటాడు. పుస్తకం అందంగా వున్నదా లేదా అన్నదే అప్పుడెదురయ్యే ప్రశ్న. గెటప్ బాగుంది. బస్, అంతటితో సమస్య సగం తీరిపోయినట్టే!"

"కానీ యిన్ని పుస్తకాలు యింత త్వరగా అమ్ముడు పోవడానికి కావలసినంత విస్తృతమైన మార్కెట్టు దేశంలో వుందంటావా రాధాపతి?"

"మార్కెట్టును మనం పట్టుకోవాలి. ఇప్పుడీ పుస్తకాల వ్యాపారం పాలిటికి లైబ్రరీలే కామధేనువులు. ప్రతి కాలేజికి, హైస్కూలుకు గ్రంథాలయాలున్నాయి. మూడంటే మూడే పుస్తకాలతో మనం దేశంపైన బడితే లాభముండదు. మొదట మన పుస్తకాలను ఎక్స్చేంజికి పెట్టాలి. దేశంలో మనలాంటి పబ్లిషర్లు దండిగా వున్నారు. వాళ్ళ పుస్తకాలతో మన

పుస్తకాలకు వినిమయం జరుగుతుంది. సమకూరిన పుస్తకాలన్నింటితోనూ అప్పుడు మనమొక సంచార పుస్తక విక్రయాలను తయారు చేసుకోగలిగా మన్నమాట! వెళ్ళి వెళ్ళి ఒక హైస్కూలుపైన పడతాం. లైబ్రరీ ఫీజు క్రింద వసూలైన మొత్తం ఆ హైస్కూల్లో ఒక వెయ్యి రూపాయలదాకా వుంటుంది. ఆ వెయ్యీ మనకు దక్కినట్టే లెక్క!"

"కానీ అందులోనైనా పోటీ వుండకపోతుందా రాధాపతీ?"

పెద్ద పెట్టున నవ్వసాగాడు రాధాపతి. "పోటీ లేనిది వ్యాపారమే నటండీ మేష్టరుగారూ! అదెక్కడికి వెళ్ళినా తప్పదు. ఒకడు ముప్పై పర్సెంటు కమీషన్ యిస్తానంటాడనుకోండి, మనం నలభైదాకా హెచ్చిస్తాం. ముందుగానే జాగ్రత్తపడి పుస్తకం ఖరీదు కాస్త హెచ్చుగానే నిర్ణయించుకోడం అవసరం. పేజీలు తక్కువైనా పరవాలేదు. గట్టిగా అట్టవేసి, పైన ఒక జాకెట్టుకవరు తొడిగితే అరవై డబ్బై పేజీల పుస్తకమైనా రెండు రూపాయలు పలుకుతుంది. కొనేవాడికి కావలిసింది కమిషను. అదెలాగూ వాడికి ముడుతోంది. చదివినవాడికి పుస్తకం బాగుంటుంది. బాగుండదు, అది మన కనవసరం! డబ్బు పెట్టి కొననేలేదు గనక వాడికెలాగు పుస్తకం బాగోగులను గురించి రిమార్కుచేసే హక్కు లేనేలేదు. మనకు కావలసింది కమీషను. అదెలాగూ మనకు దక్కనే దక్కుతుంది. ఎవడికీ నష్టంలేని నిక్షేపంలాంటి బేరం యిదొక్కటే ననిపిస్తుంది...."

రాధాపతి వ్యాసమూర్తి యింటి దగ్గర గడిపిన కాలం రెండుగంటలు. ఆ స్వల్ప వ్యవధిలోనే అతడి యింటి పరిస్థితులేమంత ఆశావహంగా వుండటం లేదని గ్రహించాడు. తాతలకాలంనాటి పెంకుటిల్లు. దుంగలుపడి వికృతంగా వున్న గోడలు. కూలిపోతున్న పెరడు. మాసినదుస్తుల్లోవున్న పిల్లలు. తనంతట తానుగా వలచి వ్యాసమూర్తి దారిద్ర్య దేవతను ఆరాధిస్తున్నాడేమో ననిపించింది రాధాపతికి! తలచుకుంటే అతడు ఆర్థికంగా బాగుపడదాని కెన్నో అవకాశాలున్నాయి. పట్టుగా కూర్చుని ఒక నవలవ్రాస్తే చాలు కొన్ని వందల రూపాయల జేబులో వున్నట్టే!

"చూడండి మేష్టరుగారూ!" అన్నాడు రాధాపతి– "ఈ సారి తప్పకుండా మీ నవల వేసి తీరాలి. ఇప్పుడు రెండు వందలిస్తున్నాను. పుస్తకం బయటపడగానే మళ్ళీయింత డబ్బు యిచ్చుకుంటాను. వ్యాపారంలో లాభాపేక్ష వుండకపోదు. కానీ మీ పుస్తకానికి సంబంధించినంత వరకు నేను కోరేది లాభంగాదు మీ పుస్తకాలుగూడా వేస్తున్నానన్న పేరొక్కటే నాకు కావలిసింది...."

రాధాపతి కోరిక నెగ్గింది. వ్యాసమూర్తి అతిడి కొక నవల వ్రాసి యివ్వడానికి అంగీకరించాడు.

మహాకవిత్వ దీక్షావిధిగాకపోయినా, నవల వ్రాయడానికికూడా కొంత ఏకాగ్రత అవసరం. వ్యాసమూర్తి నెలరోజులదేపనిలో గడిపాడు. వ్యాపారంలో నమ్మకం కన్నతల్లి లాంటిది. ఒప్పందానికి సమ్మతించి అడ్వాన్సు పుచ్చుకున్న తర్వాత అందుకు వినిమయంగా యిచ్చేవస్తువు నాసిరకమైనదై వుండగూడదు. తన రచన యితరులకు రుచించడం వేరు! అది మొదట తనకే రుచించాలి. వ్రాసి ముగించి. ఒకటికి రెండుసార్లు చదివించుచుకున్న తర్వాత తృప్తిగా నిట్టూర్చాడు వ్యాసమూర్తి.

నవలను టపాలో రాధాపతికి పంపుకోగానే యజ్ఞానంతరం అవబృథ స్నానం చేసినంత ఆనందం కలిగింది. వ్యాసమూర్తికి! ఇక దాని ఆకారాన్ని దిద్ది తీర్చుకునే బాధ్యత రాధాపతిది! ఒక రచన పూర్తిచేసిన ఉత్సాహంలో అతడింకొకదాన్ని గురించి ఆలోచించడంలో నిమగ్నుడై వున్న సమయం. 'మీకొక పార్సెలువుందిసార్' అన్నాడు పోస్ట్‌మేన్. వ్యాసమూర్తి విప్పిచూచాడు. అది తాను రాధాపతికి పంపిన నవల. అతడు త్రిప్పిపంపగా తనకు చేరిన నవల!

అనుబంధంగా ఒక ఉత్తరం.

"ప్రియమైన మేష్టరుగారికి, నమస్కారాలు. నవల చేరింది. ఒక గ్రుక్కలో చదివి ముగించాను. చక్కని యితివృత్తం విశిష్టమైన శైలి. పాత్రపోషణ అద్భుతం. నవల చాలా బాగుంది. ఎంత బాగున్నదంటే నవలను పూర్తిచేసేసరికి యిటీవల 'సినిమాలకు కథలు కావాలంటూ' పత్రికల్లో పడిన ప్రకటనలన్నీ ఒక పెట్టున జ్ఞప్తికి వచ్చేశాయి. అందువల్ల యిందులో కొన్ని మార్పులు అత్యవసరమని భావిస్తున్నందుకు మన్నించండి. మీ నవలలో శేఖరమన్న నిరుద్యోగివున్నాడు. అతడికి చిన్ననాడే పెళ్ళయింది. బిడ్డలున్నారు. సంసార సాగరాన్ని యీదలేక అతడు పారిపోతాడు. అందాకా బాగానేవుంది. కానీ, ఆ తరువాతగూడా అతడేవో కష్టాలేపడ్డట్టు అభివర్ణించారు. అంతకంటే యిలా మార్చితే బాగుంటుందని నా సూచన. శేఖరం నగరానికి వెళ్తాడు. అక్కడతనికి ఓ దొంగల ముఠాతో సావాసం కలుగుతుంది. అతడి తెలివితేటలు దొంగలకు చక్కగా ఉపకరిస్తాయి. ఇప్పుడు శేఖరం నిర్ధనుడుగాడు! ఇలావుండగా ఓ రోజున శేఖరానికి రోడ్డుపైన సునంద కనిపిస్తుంది. (సునంద ఈ నవలలో ప్రవేశ పెట్టబడుతున్న క్రొత్త స్త్రీ పాత్ర, అసలీ నవల పేరుగూడా 'సునంద'గా మార్చితే బాగుంటుందేమో ఆలోచించండి.) సునంద శేఖరంతో కలసి చదువుకున్న అమ్మాయి. అప్పట్లో ఆ యిద్దరిమధ్య కొంత ప్రణయ కలాపం జరిగి వుంటుంది గూడా! శేఖరం కనిపించగానే సునందలో చిన్ననాటి ప్రేమ మళ్లీ చిగురిస్తుంది. శేఖరం తనింకా అవివాహితుడేనని, (యిందు కేదైనా మంచి కారణమే కనిపెట్టాలి) ఉద్యోగాన్వేషణ

కోసం యిలా వచ్చాననీ సునందతో చెబుతాడు. సునంద తండ్రి గొప్ప ఉన్నతోద్యోగి శేఖరానికి మంచి ఉద్యోగం లభిస్తుంది. అంతలో సునంద తండ్రి వున్నట్టుండి మంచానపడి, కుమార్తెను శేఖరానికి అప్పజెప్పి హఠాత్తుగా చనిపోతాడు. ఆవిధంగా శేఖరం, సునంద ఒక యింట్లోనే కలిసి నివసించవలసి వస్తుంది. శేఖరానికీ తన హృదయాన్ని అర్పించుకుని అతడికి మరింత చేరువగా రానుంకిస్తున్న సునంద ఒకవైపున, ఆమెనుంచీ దూరంగా వైదొలగి పోవడానికి పన్నాగాలు వెదుకుతున్న శేఖరం మరొక వైపున. వీరినడుమ ఈ యిద్దరికీ త్వరగా వివాహం చేసేయాలనుకుంటున్న బంధుమిత్రులు. అక్కడ స్వగ్రామంలో శేఖరం జాడను గురించి అన్వేషిస్తున్న భార్యా బిడ్డలు. ఇక్కడ తమతో కలసి వుండకపోతే హత్యాపరాధాన్ని మోపగలమని బెదిరిస్తూ శేఖరం దగ్గర డబ్బు గుంజుకుపోతున్న దొంగలముఠా! ఈ విచిత్ర పరిస్థితులు ఆధారంగా ఎన్ని రసవత్తరమైన సంఘటనలనైనా సృష్టించవచ్చు. అలా చేసినట్టయితే ఏంతటి సినిమా ప్రొడ్యూసరైనా ప్రలోభపడదగిన లక్షణాలన్నింటినీ ఈ నవలలోకి ప్రోది చేశామన్న మాట! ముగింపును గురించి అట్టే ఆలోచన పెట్టుకోండి. ఒక అబ్బాయి యిద్దరమ్మాయిల కథల్లో చివరికి వచ్చేసరికి (చివరి రీలులోననుకోండి పోనీ) ఒక అమ్మాయి చనిపోవలసి వుండడం తప్పనిసరి! మరేం ప్రమాదం లేదు. పెళ్ళామే చనిపోయేటట్లుగా చూడండి. సునంద వివాహంతో కథ సుఖాంతం గావాలి. నవలలో మొదటి యాభై పేజీలు కథ యథాతథంగా ఉంటుంది. ఆపైన మార్పుచేస్తే సరిపోతుంది. నవల నాకొక నెలరోజుల్లో చేరితేచాలు. ఆలోగా నేను ముఖచిత్రం వేయించి బ్లాకు చేయిస్తాను, బదులు వ్రాయండి...."

వ్యాసమూర్తిలో చలనం లేదు. అతడు ఆలోచనా పరాధీనుడై చాలా సేపటివరకు అలాగే కూర్చుండిపోయాడు.

◆ ◆ ◆

రాధాపతి సూచించిన మార్పులతోనూ, నేర్పులతోనూ వ్యాసమూర్తి నవల అతడికి తిరిగి వెళ్ళింది. దానితోబాటుగా తానూ ఒక ఉత్తరాన్ని జతచేశాడు వ్యాసమూర్తి.

"ప్రియమైన రాధాపతి! ఎంతగా మన కిష్టం లేకపోయినా కొన్ని విషయాలను గురించి ప్రస్తావించక తప్పదు. అలాంటివాటితో నేనిప్పుడు పేర్కొంటున్న దొకటి రచయితను గనుక యిది నా పాలిటికి మిక్కిలి ముఖ్యమైనదిగూడా! విజ్ఞులైన అలంకారికులు సాహిత్య ప్రయోజనాన్ని గురించి ఎన్నో అభిప్రాయాలను సెలవిచ్చారు. వాటిలో ఒకటి రెండింటిని మాత్రమే నా అల్పబుద్ధి జీర్ణించుకోగలిగింది. సాహిత్యం ప్రపంచానికి శ్రేయస్సు

నందించాలన్న దొకటి. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించాలన్నది రెండవది. ప్రస్తుతం ఈ రెండుసూత్రాలకు కట్టుబడివుండాలని ఆశించే సాహిత్యకారులపట్ల సానుభూతిని మాత్రమే వెల్లడించే దుస్థితిలో నే నున్నాను!

బాటల కూడలిలో రెక్కమానులుండడం నువ్వుచూచే వుంటావు! ఫలానా వూరికి ఫలానారోడ్డు పైనే వెళ్ళాలనీ, అలా వెళ్ళినట్లయితే నిర్దేశింపబడిన దూరంలో నువ్వావూరిని చేరుకోగలవనీ ఆ రెక్కమాను నీకు సూచిస్తుంది. ఈ దేశంలో మునుపు సాహిత్యం ఆ రెక్క మ్రానికి మల్లే జనతకు దారి జూపుతుండేది. అలావుండగా ఈనాటికీ ఏం జరిగిందంటే వాతావరణంలో భీభత్సం చెలరేగినకొద్దీ ఆ రెక్కమానికి పునాదులు కదిలిపోసాగాయి. పాపం, ఒక దుర్ముహూర్తాన అది నేల కూలిపోయింది. మళ్లీ పైకెత్తి నిలబెట్టడంలో దాన్ని త్రిప్పి నాటటం జరిగింది. ఇంక చూచుకోవలసిందే తమాషా! ఇప్పుడీ రెక్కమాను సూచన మేరకు బయల్దేరిన పాంథుడు ఏనాటికీ తాను చేర దలచుకున్నచోటికి చేరుకోలేడు. పోగా ఈ రెక్కమానులోని ఒకటి రెండు రెక్కలు సూచిస్తున్న వైపున రోడ్డు లాంటి దేదీలేదు! ఆవైపుగా వెళ్తే ఎదురయ్యేవి ఊళ్లుగావు. కొండలు, లోయలు, కీకారణ్యాలు, వన్యమృగాలు మాత్రమే!

ఐతే జనత ఎందుకిలా గ్రుడ్డిగా ఈ రెక్కమానునే నమ్ముకున్నది? దాని సూచన మేరకు ఎందుకలా అడవిమృగాలు రాజ్యంచేసే కీకారణ్యాలలోకి వెళ్ళిపోతున్నది?– ఈ ప్రశ్నలే నన్నిప్పుడు వేధిస్తున్నవి.

ఒకటి మట్టుకూ ఖాయం. ఇప్పుడు నేను నీకు పంపుతున్న నవల ముద్రణపొంది లోకంలోకి రాగలిగేలోపుగా నేను పై ప్రశ్నలకు సమాధాన మేమిటో తేల్చుకోనైనా తేల్చుకుంటాను. లేదా వాటిని గురించి ఆలోచించడమైనా మానుకుంటాను. ప్రస్తుతానికి సెలవు.

ఇట్లు

వ్యాసమూర్తి.

(...భారతి, జనవరి 1967)

❀ ❀ ❀